క్లుప్తంగా

గ్రామ దేవతలకు విశేష పూజలు

తవణంపల్లె: మండల కేంద్రంలో భక్తిశ్రద్ధలతో సప్తకన్నికలకు శుక్రవారం పూజలు చేశారు. దాతల సహకారంతో సప్తకన్నికల గుడిని నూతనంగా నిర్మించారు. దాతలచే ఏర్పాటు చేసిన సప్తకన్నికల అమ్మ వారి విగ్రహాలకు పూజలు చేసి ధాన్యపు రాసుల మధ్య 40 రోజుల పాటు ఉంచినట్లు వివరించారు. తర్వాత గుడికి కుంభాభిషేకం చేయించి విగ్రహాలను ప్రతిష్టాపన చేస్తామని వివరించారు. పూజల్లో గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టెక్నాలజీపై పట్టు అవసరం



మాట్లాడుతున్న చైర్మన్ రంగనాథం

చిత్తూరు కలెక్టరేట్: ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీపై పట్టు ముఖ్యమని సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ రంగనాథం అన్నారు. నగరంలోని సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం రెండు రోజుల జాతీయ స్థాయి సింపోజియంను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరిలో ఖచ్చితంగా ప్రతిభ ఉంటుందన్నారు. ఆ ప్రతిభను గుర్తించి జీవితంలో రాణించాలని సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలను పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ రామకృష్ణారావు, సెక్రటరీ బద్రినారాయణ, ప్రిన్సిపల్ వెంకటాచలపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రహణమొర్రిపై అవగాహన

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా బాలల సంరక్షణ కేంద్రంలో శుక్రవారం ప్రపంచ డౌన్ సిండ్రోమ్(గ్రహణ మొర్రి) దినోత్సవాన్ని నిర్వహించారు. డౌన్ సిండ్రోమ్ ఉన్న పిల్లల తల్లిదండ్రులకు పెదాల చీలికపై అవగాహన కల్పించారు. ఈ సమస్యను ప్రభుత్వం తరఫున చికిత్స అందిస్తున్నామని చెప్పారు. వీటిని బాధిత తల్లిదండ్రులు వినియోగించుకోవాలని డాక్టర్ గిరి పేర్కొన్నారు. అనంతరం కొంత మంది పిల్లలకు కంటి అద్దాలు పంపిణీ చేశారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ముఖ్యం



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న విద్యార్థిని

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థుల్లో పోటీతత్వం ముఖ్యమని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జీవన జ్యోతి అన్నారు. పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వికసిత్ భారత్ యువజన పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి 115 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఒకే దేశం–ఒకే ఎన్నికలు అనే అంశంపై ప్రసంగించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే అన్ని పోటీల్లో పాల్గొనడం అలవాటు చేసుకోవాలన్నారు. పోటీతత్వం వల్ల జీవితంలో రాణించగలరని తెలిపారు. పోటీల్లో గెలుపు ఓటములు సహజమని, కుంగిపోకుండా ముందుకు సాగాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి సెట్విన్ సీఈవో మోహన్‌కుమార్, సావిత్రమ్మ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్, యువజన అధికారి ప్రదీప్, సమన్వయ కర్త సుశీల భారతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా విద్యాబోధన



మాట్లాడుతున్న సీడీపీఓ వినత శ్రీ

గంగాధర నెల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలను ఆకట్టుకునేలా విద్యాబోధన చేయాలని సీడీపీఓ వినతశ్రీ ఆదేశించారు. శుక్రవారం మండలపరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు రెండో రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అనురాధ, నాగరత్నమ్మ పాల్గొన్నారు.



పంచ భూతాలు అనగా నీరు, నేల, నిప్పు, గాలి, ఆకాశం. ప్రపంచంలో ప్రతి జీవి ఈ పంచ భూతాల నిర్మితమే. జీవులన్నీ చివరికి ఈ పంచభూతాల్లోనే ఐక్యం కావాలి. జలం మన బలం...జలం మన గళం... మొత్తానికి నీరు ప్రాణాధారం. జలం లేకుంటే జీవమే లేదు. అంతటి ప్రాముఖ్యముంది నీటికి. ఇప్పుడిదంతా ఎందుకు అంటే ఈ రోజు ప్రపంచ జల దినోత్సవం.

జలమే జీవం



- ప్రతి నీటి చుక్కనూ సంరక్షించుకోవాలి
- నేడు ప్రపంచ జల దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్: సకల కోటికి ప్రాణాధారం నీరు...జల సంరక్షణే భావి భారతావనికి శ్రీరామ రక్షగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. అందుకే వర్షపు నీటిని ఒడిసిపట్టాలి. ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు.. పొలాల్లో చేను కుంటలు ఏర్పాటు చేసుకోవాలి. అందరూ నీటి విషయంలో బాధ్యతగా మసలుకోవాలి. జనాభా పెరుగుదలకు అనుగుణంగా నీటి వనరులు వృద్ధి చెందకపోవడంతో భవిష్యత్ తరాలకు నీటి సమస్య ఎదురుకానుంది. వృథాగా పోయే వర్షపు నీటిని ఒడిసి పడితే నీటి కష్టాలు చాలా వరకు తీరే అవకాశం ఉంది.

కర్తవ్యంగా భావించాలి


ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవడం తమ కర్తవ్యంగా భావించాలి. వారం రోజులు ఆహారం లేకపోయినా మనిషి జీవించగలడేమో కానీ, మూడు రోజులకు మించి నీరు లేకుంటే బతకలేరు. ఇలాంటి తరుణంలో జలం ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా మార్చి 22వ తేదీన ప్రపంచ జల దినోత్సవాన్ని నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి తీర్మానించింది.

నియోజకవర్గాల్లో నీటి పనులు

చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో నీటి పనులు చేపడుతున్నారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నీటిసరఫరా పనులను చేపడుతోంది. ఇందులో రూ.15.21 కోట్లతో 154 నీటి సరఫరా పనులు చేపడుతున్నారు. ప్రజలందరికీ నాణ్యమైన నీటిని అందించేందుకు జలజీవన్ మిషన్ అమలు చేస్తున్నారు. అదే విధంగా రెండు నియోజకవర్గాల్లో నీటి సంరక్షణ పనులు చేపడుతున్నారు.

అధిక వృథాతో ముప్పు

దేశంలోని ప్రధాన నగరాల్లో కనీసం తాగేందుకు నీరు దొరక్క ప్రజలు అవస్థలు అల్లాడాల్సిన పరిస్థితులు ఉంటాయి. మరికొన్ని చోట్ల విపరీతంగా నీరును వృథా చేస్తుంటారు. ఫలితంగా రోజురోజుకు భూగర్భ జల మట్టాలు పడిపోతున్నాయి. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో ముప్పు తప్పదు. అందుకే నీటి వృథాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.



- ఇంట్లో కొళాయిలను వాడిన తర్వాత పక్కాగా ఆపేయాలి
- అంతే కాకుండా గ్రామాల్లో, నగరాల్లో బయటకు వెళ్లే సమయంలో ఎక్కడైనా వీధి కుళాయిల నుంచి నీరు వృథాగా పోతుంటే తమ వంతు బాధ్యతగా వాటిని నిలిపివేయాలి.
- స్కూల్స్‌లో నీరు వృథా కాకుండా చూసుకోవాలి. వాష్‌రూముల్లో కుళాయిలు వాడిన తర్వాత వెంటనే ఆపివేయాలి.

అవగాహన కల్పిస్తూ..

నగరంలోని నేచర్ లవర్స్ (ప్రకృతి ప్రేమికులు అసోసియేషన్) నాయకులు నీటి ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆ సంఘం నిర్వాహకులు నేచర్ మురళి పలు విద్యాసంస్థల్లో తమ బృందంతో విద్యార్థులకు నీరు, మొక్కల ప్రాధాన్యతను వివరిస్తున్నారు. జలం లేనిదే జీవం లేదని, నీటి వనరులను సంరక్షించుకోవడం ఒక్కటే మార్గమని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

నీటి సంరక్షణ చాలా ముఖ్యం



నీటి సంరక్షణ అన్నది చాలా ముఖ్యం. నీరు కలుషితం కానివ్వకుండా చూసుకోవాలి. డబ్బా నీళ్లల్లో హానికర బ్యాక్టీరియా ఉంటుందనే విషయాన్ని ఎన్నో సర్వేలు వెల్లడిస్తున్నాయి. కలుషిత నీరు, అపరిశుభ్రతతో 80 శాతం వ్యాధులు వ్యాపిస్తున్నట్లు వైద్యులు వెల్లడిస్తున్నారు. నీరు ప్రకృతి ఇచ్చే వరం కాబట్టి ఆ నీటిని జాగ్రత్తగా సంరక్షించుకోవాలి. నీటిని పొదుపుగా వాడి, వృథాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరం కృషి చేద్దాం.

–నేచర్ మురళి, చిత్తూరు నగరం

నీరు ప్రాణాధారం



సమస్త ప్రాణులకు నీరు ప్రాణాధారం. ప్రపంచంలో పలు చోట్ల నీరు లేకుండా చాలా అవస్థలు ఎదుర్కొంటున్నారు. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి. ప్రతి నీటి చుక్కను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. జీవన విధానాలను మార్చుకుని నదులు కలుషితం కాకుండా సంరక్షించుకోవాలి. జలం లేనిదే జీవం లేదన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. నేడు నీటిని మనం రక్షిస్తే భావితరాలను జలం కాపాడుతుంది.

–దినేష్, నేచర్ లవర్స్ అసోషియేషన్ సభ్యుడు. చిత్తూరు నగరం

అప్రమత్తతతోనే చోరీలకు కళ్లెం

- వేసవిలో జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీసుల సూచన
- అనుమానితులపై సమాచారం అందివ్వాలని విజ్ఞప్తి



సీఐ శ్రీనివాసులు

బంగారుపాళెం: ప్రజలు అప్రమత్తంగా వ్యవహరిస్తే చోరీల బారిన పడకుండా రక్షణ పొందేందుకు అవకాశం ఉందని సీఐ శ్రీనివాసులు సూచించారు. వీలైనంత వరకు ఇళ్లు, దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్మార్ట్ లాక్‌లను వినియోగించుకుంటే మంచిదన్నారు. చోరీల విషయంలో ఎలాంటి అప్రమత్తతతో ఉండాలి. వేసవిలో ఇళ్ల వద్ద చోరీలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మహిళలు మోసగాళ్ల చేతిలో సునాయాసంగా మోసపోయి బంగారు నగలు పోగొట్టుకుంటున్నారు. అలాంటి వారితో ఎంత జాగ్రత్తగా వ్యవహరించాలో వివరించారు.

- వేసవిలో రాత్రుల్లో చల్లని గాలి కోసం ఆరుబయట, మిద్దెలపై పడుకునే ముందు ఇళ్లకు తలుపులు వేసి తాళాలు వేసుకోవాలి.
- వేసవి సెలవులకు ఇంటిల్లిపాదీ బంధువుల ఇళ్లకు, యాత్రలకు, దేవాలయాల సందర్శనకు వెళ్లినప్పుడు ఇరుగుపొరుగు వారికి చెప్పి ఇంటిని ఓ కంట కనిపెట్టమని అభ్యర్థించాలి.
- అవకాశం ఉంటే తెలిసిన వారిని ఇంట్లో వదిలి వెళ్లాలి.
- బయట వెళ్లేటప్పుడు ఇంట్లో బంగారు, డబ్బులు పెట్టి వెళ్లరాదు. బ్యాంక్ లాకర్లలో పెట్టుకోవాలి. లేదా నమ్మకమైన వ్యక్తుల వద్ద భద్రపరచుకోవాలి.
- ఊరికి వెళ్లే ప్రధాన ద్వారానికి వేసే బీగాలు బయటకు కనబడకుండా జాగ్రత్తపడాలి.
- ఇంటి ముందు లైటు వెలిగేలా ఏర్పాటు చేసుకోవాలి.
- ఇంటికి ప్రహరీ ఉంటే ఆ గేటుకు తాళం వేసుకోవాలి.
- వారం, అంతకు మించి దూరప్రాంతాలకు వెళ్తున్నప్పుడు స్థానిక పోలీసులకు ఇంటి అడ్రస్, ఫోన్ నంబరు తెలియజేయాలి.
- రాత్రి సమయాల్లో ఇళ్ల ముందు ఉంచే ద్విచక్ర వాహనాలకు వీల్ లాక్‌లను వేసుకోవాలి. ఎప్పుడూ హ్యాండిల్ లాక్ వేసే అలవాటు చేసుకోవాలి.
- చైన్ స్నాచింగ్ విషయంలో మహిళలు మరీ అప్రమత్తంగా ఉండాలి.
- మహిళలు సాధ్యమనంత వరకు నిర్జన ప్రదేశాల్లో ఒంటరిగా నడిచి వెళ్లకూడదు. వాకింగ్‌కు వెళ్లేటప్పుడు మహిళలతో కలసి వాకింగ్ చేయాలి.
- మహిళలు నడచి వెళ్లేటప్పుడు మెడలో నగలు పైకి కనిపించకుండా చీరకొంగును కప్పుకోవాలి.
- నడచి వెళ్లే పరిస్థితి వచ్చినప్పుడు సాధ్యమైనంత వరకూ మెడలో బంగారు నగలు వేసుకుని వెళ్లరాదు. మోటారు సైకిళ్లపై ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే తక్షణమే పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలి.

గ్రామాల్లో ఇంటింటికీ వైద్యసేవలు



ఎల్‌పురంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు పైసా ఖర్చులేకుండా, సమయం వృథా కాకుండా ఇంటివద్దే వైద్యసేవలు అందిస్తున్నామని గుడిపాల, బొమ్మసముద్రం డాక్టర్లు సంధ్య, రష్మిత అన్నారు. పశుమంద, ఎఎల్‌పురం గ్రామాల్లో శుక్రవారం వైద్యసేవలు అందజేశారు. ముందుగా శిబిరం ఏర్పాటుచేసి ఓపీ సేవలు అందించారు. 95మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు పరీక్షలు చేశారు. ఎస్టీ జనాభా ఉన్న ఏఎల్‌పురం, పశుమందలో అస్తమా, ఉబ్బసం ఉన్న రోగులకు స్క్రీనింగ్, స్పిరోమెట్రి టెస్టులను చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీలక్ష్మి, హైమావతి, జబసెల్వి, ఉమామహేశ్వరి, సుమతి, స్వర్ణ, కర్లినా, రీటా, సుజిమ, స్వప్న పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్‌కు వేధింపులు

చిత్తూరు కార్పొరేషన్: అంగన్‌వాడీ వర్కర్‌ను అధికారులు వేధించడం మానుకోవాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు గంగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శాంతిపురం ప్రాజెక్టు కొలమడుగు అంగన్‌వాడీ వర్కర్ స్వాతిపై రాజకీయ ఒత్తిళ్ల మేరకు మెమోలు ఇస్తున్నారని విమర్శించారు. ఆమెను మానసికంగా ఇబ్బంది పెట్టడానికి ఇలా చేయడం సరికాదన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని గతంలో చంద్రబాబు హామీనిచ్చారని గుర్తు చేశారు. కానీ అధికారంలో వచ్చాక వేధిస్తున్నారని ఆరోపించారు. ఆమెకు రెండు మెమోలు ఇచ్చారని మూడోది ఇచ్చి తొలగిస్తామని బెదిరిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై స్వాతి అధికారులను ప్రశ్నిస్తే దురుసుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆమె చావే శరణ్యమని యూనియన్ నాయకుల వద్ద బోరున విలపించిందని చెప్పారు.

నోటీస్ బోర్డు

నేడు మండల సమావేశం

ఐరాల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ మోహన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ధనలక్ష్మి తెలిపారు. సమావేశానికి సర్పంచులు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ మెంబర్ హాజరుకావాలని కోరారు. మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

నేడు తాళంబేడులో ఎమ్మెల్యే గురజాల పర్యటన

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు మండలం తాళంబేడు పంచాయతీ తెల్లగుండ్లవలస గ్రామంలో శనివారం ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పర్యటించనున్నారు. ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న పంట సంజీవని పనిని ప్రారంభించనున్నారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం జరుగుతుందని ఉపాధి హామీ ఏపీఓ రెడ్డెమ్మ తెలిపారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని జైన్ సంఘ ప్రార్థన మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం జరగనున్నట్లు నిర్వాహకులు సుభాష్ జైన్ తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఎస్‌వి అరవింద ఆస్పత్రి వైద్యులచే కంటి పరీక్షలు చేసి ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని ఆయన పేర్కొన్నారు.

పూతలపట్టు తహసీల్దార్‌గా రమేష్‌బాబు

పూతలపట్టు(కాణిపాకం): పూతలపట్టు తహసీల్దార్‌గా శుక్రవారం రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈయన వెదురుకుప్పం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ, పూర్తి అదనపు బాధ్యతల కింద ఇక్కడ తహసీల్దార్‌గా వచ్చారు. బదిలీలో భాగంగా ఈయన పూతలపట్టులో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న గుర్రప్ప కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు.

24న మండల సమావేశం

గుడిపాల: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శివరాజన్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దీనికి అన్నిశాఖల మండల అధికారులు వారి శాఖలకు సంబంధించి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల పూర్తి వివరాలతో రావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు తప్పకహాజరు కావాలని తెలియజేశారు.

పూర్తి చేస్తారా.. ఇలాగే వదిలేస్తారా?

- అసంపూర్తిగా దర్శనమిస్తున్న భవన నిర్మాణాలు
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులపై ఉదాశీనత
- భవనాలు లేక ఇబ్బందిపడుతున్న సచివాలయ ఉద్యోగులు



నిధుల కొరతతో పైమాఘంలో అర్థంతరంగా ఆగిన ఆర్‌బీకే భవనం



అసంపూర్తిగా దర్శనమిస్తున్న సచివాలయ భవనం

తవణంపల్లె: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తి భవనాల నిర్మాణం పూర్తి చేయడంలో అలసత్వం వహిస్తోందనే విమర్శలొస్తున్నాయి. నిధుల కొరతతో ఆగిన భవన నిర్మాణాలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందాన అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయని ఉద్యోగులు వాపోతున్నారు. మరో వైపు పనులు చేసిన కాంట్రాక్టర్లు నిధులు కోసం ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మండలంలోని 17 సచివాలయాల్లో సచివాలయ భవనాలు, ఆర్‌బీకే భవనాలు, హెల్త్ సెంటర్ల భవనాల నిర్మాణ పనులను ప్రారంభించారు.

గత ఏడాది ఎన్నికల కోడ్ నేపథ్యంలో పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ వీటి నిర్మాణం పూర్తి చేసేందుకు సుముఖత చూపడం లేదు. ఫలితంగా సచివాలయ సిబ్బంది భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 32 పంచాయతీల్లో సుమారు 16 భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. అధికారులు చొరవ చూపి, నిధులు మంజూరు చేసి, అసంపూర్తిన్న పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

సాంకేతిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలి



అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న సూపర్‌వైజర్లు

బంగారుపాళెం: అంగన్‌వాడీ కార్యకర్తలు సాంకేతిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో వాణిశ్రీదేవి సూచించారు. మండలంలోని మొగిలిమిట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పీబీపీ రెండో రోజు శిక్షణ తరగతులను ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ, ట్యాబ్, మొబైల్‌ఫోన్‌లో అంగన్‌వాడీ కేంద్రాలకు సబంధించిన వివరాలు, ఆన్‌లైన్ హాజరు నమోదు, ఎక్సెల్ షీట్ నమోదు వంటి అంశాల్లో సాంకేతికత అవసరమని అందుకు తగట్టుగా కార్యకర్తలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు విధులు ఏవిధంగా నిర్వహించాలి? పిల్లలతో ఎలా మెలగాలి, వారి తల్లిదండ్రులతో ఎలా మాట్లాడాలి, విధి నిర్వహణలో పాటించాల్సిన సమయపాలన గురించి సూపర్‌వైజర్లు జయశ్రీ, రెడ్డికళ్యాణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరూ ఆరోగ్యంగా జీవించాలి

యాదమరి: గ్రామీణ ప్రాంతంలోని అందరూ ఆరోగ్యంగా జీవించాలని శుచి స్వచ్ఛంద సేవా సంస్థ అధినేతలు పాల్ విజయ్, గ్లోరి విజయకుమార్ తెలిపారు. వారు మండల పరిధి జోడి చింతలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవసరమైన వైద్య సేవలు తమ సంస్థచే అందిస్తున్నామన్నారు. వేలూరు సీఎంసీ వైద్య సిబ్బందితో మండలంలోని ప్రజలకు ఉచిత వైద్య సేవలు చేస్తున్నామన్నారు. శిబిరంలో 120 మందికి చికిత్స చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎంసీ వైద్య సిబ్బంది, శుచి సంస్థ సిబ్బంది శాంసన్, ఆనందకుమార్, చిన్నయ్య, ధనలక్ష్మి, వరదరాజులు, జాకబ్ జాన్సన్ పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో చికిత్స చేస్తున్న వైద్యులు